క్లుప్తంగా

ఏయూ గౌరవ ఆచార్యుడిగా జగన్నాథరావు



జగన్నాథరావుకు ఉత్తర్వులు అందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఎంవీపీ కాలనీ: ఏయూ గౌరవ ఆచార్యుడిగా నన్నయ్య యూనివర్సిటీ పూర్వ ఉపకులపతి ఆచార్య ఎం.జగన్నాథరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి నుంచి బుధవారం ఉత్తర్వులు అందుకున్నారు. ఏయూ ప్రొఫెసర్ అయిన ఆయన జువాలజీ విభాగంలో దశాబ్దాల పాటు విశిష్ట సేవలు అందించారు. అనంతరం నన్నయ్య వర్సిటీకి వీసీగా నియామకమయ్యారు. ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన జగన్నాథరావును ఏయూ యాజమాన్యం గౌరవ ఆచార్యుడిగా నియమించింది. ఈ కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య కృష్ణమోహన్, తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రత ప్రమాణాలపై అవగాహన



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఎంవీపీ కాలనీ: రహదారి భద్రత ప్రమాణాలపై గ్రీన్ క్లైమేట్ టీమ్ ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీలోని ఓ పాఠశాల ఆవరణలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం మాట్లాడుతూ రహదారి ప్రమాదాలపై యువత అవగాహన కలిగి ఉండాలన్నారు. మైనర్లు వాహనాలను నడపొద్దన్నారు.

అప్పన్నకు విశేషంగా నిత్య కల్యాణం



కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్ఠింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణ ధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ ఘట్టాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాన్ని, ప్రసాదాన్ని అందజేశారు.

గిరిజారాణికి డాక్టరేట్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం న్యాయ కళాశాల పరిశోధక విద్యార్థిని గిరిజా రాణి రెడ్డికి వర్సిటీ డాక్టరేట్ లభించింది. కళాశాల ఆచార్యులు డి.సూర్యప్రకాశరావు పర్యవేక్షణలో ×ది కాంట్రిబ్యూషన్ ఆఫ్ జస్టిస్ వి.ఆర్.కృష్ణ అయ్యర్ టు ఇండియన్ జ్యుడీషియల్ ఏక్టివిజం×అంశంపై జరిపిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. ఈ మేరకు ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి నుంచి గిరిజారాణి ఉత్తర్వులు స్వీకరించారు.

18 నుంచి కనకమహాలక్ష్మి ఆలయంలో చీరల వేలం

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి భక్తులు సమర్పించిన చీరలు వేలం వేయనున్నట్టు ఆలయ ఈవో కె. శిరీష ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18 నుంచి 21వరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వేలం కార్యక్రమం ఉంటుందని, భక్తులు అమ్మవారి చీరల వేలంలో పాల్గొనగలరని కోరారు.

పర్యావరణ హితులు



చెట్టుకు పక్షి గూడును ఏర్పాటు చేస్తున్న విద్యార్థి

- ఏయూ సోషల్ వర్క్ విద్యార్థుల విశేష సేవలు
- నెలలో రెండు సార్లు శ్రమదానం
- మొక్కల సంరక్షణ బాధ్యత స్వీకరణ
- సొంతంగా వర్మీకంపోస్ట్ తయారీ

ఏయూ క్యాంపస్: పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు ఆంధ్ర విశ్వ విద్యాలయం సోషల్ వర్క్ విద్యార్థులు. మన విభాగం–మన బాధ్యత అనే నినాదంతో ముందుకు సాగుతున్నారు. విభాగంలో పుష్ప, పండ్ల జాతుల మొక్కలను పెంచడంతో పాటు, పక్షులకు గూళ్లు, మూగజీవులకు మంచినీటి పాత్రలు ఏర్పాటు చేయడం వంటి అనేక కార్యక్రమాలు చేపడుతున్నారు. విభాగాన్ని సుందరంగా తీర్చిదిద్దడంలో తమదైన భూమిక పోషిస్తున్నారు. సామాజిక సేవ(సోషల్ వర్క్) విభాగం పేరును సార్థకం చేసే విధంగా సమాజంతో అనుసంధానం అయ్యే విధంగా పని చేస్తున్నారు.

నెలలో రెండు సార్లు శ్రమదానం

విభాగంలో విద్యార్థులంతా నెలలో రెండు రోజులు విభాగం ప్రాంగణంలో శ్రమదానం చేస్తున్నారు. విద్యార్థిని, విద్యార్థులంతా స్వయంగా తోట పనిలో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ముందుగా నేలపై రాలిన ఆకులను తొలగించి, ప్రాంగణాన్ని శుభ్రం చేస్తారు. మొక్కలకు పాదులు కట్టడం, నీరు పెట్టడం వంటి పనులు చేస్తున్నారు.



నీటిని అందుబాటులో ఉంచుతున్న విద్యార్థిని

వ్యర్థం నుంచి ఎరువు తయారీ

విభాగ విద్యార్థుల్లో కొంత మంది వ్యవసాయ కుటుంబాల నేపథ్యం కలిగిన వారు ఉన్నారు. దీంతో విభాగంలో ఉన్న చెట్ల నుంచి రాలిన ఆకులను ఎరువుగా మార్చే ప్రయత్నం చేశారు. దీని కోసం విద్యార్థులు స్వయంగా ఏడు అడుగుల లోతు కలిగిన గుంతను తవ్వి దానిలో ఎండిన ఆకులను వేయడం ప్రారంభించారు. దీనిని ఎరువుగా మార్చి తిరిగి మొక్కలకు వినియోగిస్తున్నారు.



ఎరువు తయారీకి గుంతను తవ్వుతున్న విద్యార్థులు

పక్షుల కోసం పండ్ల మొక్కల పెంపకం

విభాగంలో పదుల సంఖ్యలో పక్షులు నిత్యం వస్తుంటాయి. వీటికి ఆహారాన్ని అందించే విధంగా పలు పండ్ల జాతుల మొక్కలు నాటారు. ఇప్పటికే విభాగంలో ఉన్న మామిడి చెట్లకు ఉన్న కాయలను పూర్తిగా పక్షులు తినడానికి వదిలేశారు. అదే విధంగా జామ, ఉసిరి, బొప్పాయి వంటి పండ్ల మొక్కలను విద్యార్థులు నాటి సంరక్షిస్తున్నారు. విభాగానికి మరింత అందాన్ని, ఆహ్లాదాన్ని పంచే విధంగా పలు గులాబి మొక్కలను కూడా నాటారు. వీటికి అవసరమైన నీరు పోయడం వంటి బాధ్యతలు ఒక్కొక్కరు స్వచ్ఛందంగా చేపట్టారు. భవిష్యత్తులో విభాగ ప్రాంగణంలో కిచెన్ గార్డెన్ తరహాలో కూరగాయలు, ఆకుకూరల మొక్కలు పెంచే దిశగా విద్యార్థులు ప్రణాళిక రూపొందించుకున్నారు.



విభాగ ప్రాంగణాన్ని శుభ్రం చేస్తున్న విద్యార్థినులు

విద్యార్థులు ఇష్టంతో చేస్తున్నారు..



తరగతి గదిలో పుస్తక జ్ఞానాన్ని పొందడానికి ఎంత ఆసక్తి చూపుతారో, తోట పనిచేయడానికి సైతం అంతే ఆసక్తిని విద్యార్థులు చూపుతున్నారు. ముందుగా మన విభాగ పరిసరాలు పరిశుభ్రంగా, ఆహ్లాదంగా ఉండాలనే సంకల్పంతో చేస్తున్నారు. విదేశీ విద్యార్థులు సైతం ఎంతో ఇష్టంగా ఈ సేవా కార్యక్రమాల్లో భాగమవుతున్నారు.

– ఆచార్య ఎస్.హరనాథ్, విభాగాధిపతి, సోషల్‌వర్క్ విభాగం

శ్రమదానంతో ప్రాంగణం పరిశుభ్రత



పిచ్చిమొక్కలతో నిండిపోయిన ప్రాంగణం చూసి మనం శుభ్రం చేసుకుందాం అనే ఆలోచనతో ప్రారంభించాం. నెలలో రెండు సార్లు శ్రమదానంతో ప్రాంగణం మొత్తం శుభ్రం చేస్తున్నాం. ప్రస్తుతం ఉన్న మొక్కలు, వృక్షాలు సంరక్షిస్తూ, మరిన్ని మొక్కలు నాటే ప్రయత్నం చేస్తున్నాం.

– ప్రసన్న కుమార్, విభాగ విద్యార్థి

ఆనందాన్ని ఇస్తోంది..



విశాలమైన వర్సిటీ ప్రాంగణం మొత్తం శుభ్రం చేయడం, నిర్వహణ ఎంతో కష్టతరమైన అంశం. స్వచ్ఛందంగా మన విభాగం మనమే తీర్చిదిద్దాలి అనే ఉద్దేశంతో ముందుకు సాగుతున్నాం. ఈ కార్యక్రమం ఎంతో ఆత్మ సంతృప్తిని అందిస్తోంది. ప్రకృతికి దగ్గరగా జీవించడం ఆనందాన్ని ఇస్తోంది. విభాగం పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడంలో విద్యార్థులంతా భాగస్వాములు కావడం బాగుంది.

– ఎం.వి.ఎస్.ఎస్.లక్ష్మి, ఎం.సమన్విత, ఎం.శ్రావణి, విభాగ విద్యార్థులు

గోవును గట్టెక్కించారు.!



పాడుపడిన బావిలో జారిపడిన ఆవును బయటకు తీస్తున్న స్థానికులు

ఆరిలోవ: మేత కోసం వెళ్లిన ఓ ఆవు చిక్కుల్లో పడింది. రెండు రోజుల తర్వాత బతుకుజీవుడా అంటూ బయటపడింది. వివరాలిలా ఉన్నాయి. పెదగదిలిలోని ఎర్నిమాంబ ఆలయం సమీపంలో మేత కోసం ఓ ఆవు మంగళవారం వెళ్లింది. ఇక్కడ గతంలో స్థానికులు వ్యవసాయం సాగు కోసం బావి తవ్వించారు. ఇప్పుడు ఈ బావి నీరు లేకుండా ఎండిపోయి ఉంది. మంగళవారం మేతకు వెళ్లిన ఆ ఆవు ఈ బావిలోకి జారిపోయింది. చుట్టూ సుమారు 8 అడుగుల ఎత్తులో గోడలు నిర్మించి ఉండడంతో అందులో నుంచి బయటకు రాలేకపోయింది. ఆ ఆవు యజమాని బుధవారం వెతుకుతుండగా బావిలో ఓ మూలన కనిపించింది. దీంతో స్థానికులు సహాయంతో ఆవుకు తాళ్లు కట్టి, చెక్కలతో అమర్చిన బల్ల ఏర్పాటు చేసి దాని మీద నుంచి అతి కష్టమీద బయటకు తీసుకొచ్చారు. జారిపోవడం వల్ల ఆవు కాళ్లు, వెనుక భాగం స్వల్ప గాయాలయ్యాయి.

మార్టూరుకు తాగునీటి ట్యాంకర్ వితరణ

బీచ్ రోడ్డు: అచ్యుతాపురంలోని మార్టూరు గ్రామానికి తాగునీటి సరఫరా కోసం సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా ట్యాంకర్‌ను అందజేసినట్టు యోకోహామా సంస్థ ప్రతినిధి ప్రహ్లాద్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు సంస్థ చేపట్టిన కార్యక్రమాలను బుధవారం విలేకరులకు తెలియజేశారు. పది వేల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంకర్‌ను మంగళవారం మార్టూరు గ్రామంలో ప్రారంభించినట్టు తెలిపారు. అలాగే ట్రాఫిక్ నియంత్రణ కోసం 100 బారికేడ్లను పోలీసులకు అందజేశామన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి



9వ వార్డు కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న అక్కరమాని విజయనిర్మల

ఆరిలోవ: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల కోరారు. 9వ వార్డులో బుధవారం సాయంత్రం కార్పొరేటర్ స్వాతి ఆధ్వర్యంలో ఆ పార్టీ కార్యకర్తలతో జరిగిన సమావేశంలో అక్కరమాని మాట్లాడారు. జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో అందరూ కలసి సమష్టిగా పనిచేసి రానున్న ఎన్నికల్లో నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

సీజీఆర్ఎఫ్‌తో విద్యుత్ వినియోగదారులకు న్యాయం



విద్యుత్ వినియోగదారులతో మాట్లాడుతున్న సీజీఆర్ఎఫ్ చైర్మన్ సత్యనారాయణ

అక్కిరెడ్డిపాలెం: విద్యుత్ వినియోగదారులు తమ సమస్యల పరిష్కారానికి కన్జ్యూమర్స్ గ్రీవెన్స్ రీడ్రసల్ ఫోరం (సీజీఆర్ఎఫ్) ద్వారం న్యాయం పొందవచ్చని సీజీఆర్ఎఫ్ చైర్మన్ జస్టిస్ డాక్టర్ బి.సత్యనారాయణ అన్నారు. ఆటోనగర్ ఐలా భవనంలో బుధవారం ఆంధ్రప్రదేశ్ తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ వ్యవస్థ (ఏపీఈపీడీసీఎల్) ఆధ్వర్యంలో వినియోగదారుల సమస్యల పరిష్కార న్యాయస్థానం (సీజీఆర్ఎఫ్) నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటోనగర్‌లో విద్యుత్ సమస్యలపై ఎదుర్కొంటున్న పలు ఇబ్బందులను పారిశ్రామికవేత్తలు చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. జోన్ – 2 ఈఈ బీకే నాయుడు మాట్లాడుతూ ఆటోనగర్ విద్యుత్ పనులకు రూ.1.6 కోట్లు ఖర్చు చేశామన్నారు. ఏ–బ్లాక్‌లో నివాసిత ప్రాంతాలకు, పరిశ్రమలకు ఒకే విద్యుత్ లైన్లు కొనసాగుతుండటంతో పరిశ్రమలకు ఏర్పడుతున్న ఇబ్బందులపై పారిశ్రామికవేత్త నాగిరెడ్డి తెలిపారు. విద్యుత్ వైర్లకు అంతరాయం అంటూ చెట్లను నరికివేస్తున్నారని పారిశ్రామికవేత్త పాండురంగ ప్రసాద్ తెలిపారు. చైర్మన్ జస్టిస్ డాక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ విద్యుత్ సమస్యలను టోల్ ఫ్రీ నంబర్ 1912కి ఫిర్యాదు చేయవచ్చన్నారు. పరిష్కారం కాని ఎడల సీజీఆర్ఎఫ్‌కు వ్యక్తిగతంగా గానీ, తపాల ద్వారా గానీ, ఈమెయిల్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీ స్వామి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎస్ఈ ఎల్.మహేంద్రనాథ్, మెంబర్ ఆఫ్ టెక్నికల్ పి.శ్రీనివాస్, ఆర్.సురేంద్రకుమార్, గాజువాక డిప్యూటీ ఈఈ సీహెచ్ మీనకేతనరావు, ఆటోనగర్ ఈఈ పార్థసారథి, ఏఈలు పాల్గొన్నారు.

కంచరపాలెం పోలీస్ స్టేషనలో 'మాల్-ఖానా' ఏర్పాటు



కంచరపాలెం పోలీస్ స్టేషన్ టెర్రస్‌పై బ్లాక్‌లను పరిశీలిస్తున్న సీఐ విజయ్‌కుమార్

మర్రిపాలెం: నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ ఆదేశాల మేరకు కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్‌లో 'మాల్–ఖానా' ఏర్పాటు చేస్తున్నట్టు సీఐ ఎస్.విజయ్‌కుమార్ తెలిపారు. బుధవారం స్టేషన్ టెర్రస్‌పై ఈ బ్లాక్‌లను ఏర్పాటు చేశామన్నారు. పెరుగుతున్న టెక్నాలజీకి అనుగుణంగా ఈ కోడ్‌ను తయారు చేసినట్టు చెప్పారు. కేసులు నమోదైన తర్వాత సంబంధిత వస్తువులను కోర్టులో ప్రవేశపెట్టడానికి వాటిని పోలీసులు స్వాధీనం చేసుకుంటారన్నారు. నేరాలను బట్టి నిందితుల ఉపయోగించిన పరికరాలను జాగ్రత్తగా కోర్టులో ప్రవేశపెట్టడానికి ఉపయోగపడేలా మాల్ ఖానా తయారు చేస్తున్నట్టు తెలిపారు. దీని ద్వారా ఎప్పుడు ఏ నేరం ఎలా జరిగింది, అంతేకాక కోర్టులో ప్రవేశపెట్టడానికి సులభతరంగా ఉంటుందన్నారు. ఎన్ని ఏళ్లు గడిచినా, ఎంతమంది సిబ్బంది మారినా.. మాల్–ఖానా ద్వారా రికవరీ ప్రాపర్టీ ఎక్కడో తెలుసుకునేందుకు వీలుగా ఉంటుందని సీఐ వివరించారు.

ఫ్యూజన్ ఫుడ్స్ ఫెస్టివల్ ప్రారంభం



ఫ్యూజన్ ఫుడ్స్ ఫెస్టివల్ ప్రారంభోత్సవంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య కృష్ణమోహన్, తదితరులు

మద్దిలపాలెం: ఎంపిక చేసుకున్న రంగంలో రాణించి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య కృష్ణమోహన్ సూచించారు. మద్దిలపాలెంలోని ఎలియన్స్ మేనేజ్‌మెంట్ కళాశాలలో హోటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థులతో ఫ్యూజన్ ఫుడ్స్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ ఫెస్టివల్‌ను ఏయూ రిజిస్ట్రార్ ముఖ్యఅతిథిగా ప్రారంభించారు. విద్యార్థులు తయారు చేసిన వంటకాల రుచులు చూసి, అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థులకు దేశ, విదేశాల్లో ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ విభాగాధిపతి ఆచార్య జాలాది రవి, ఆచార్య బి.మోహన్ వెంకటరామ్, కళాశాల అకడమిక్ డైరెక్టర్ కార్తకేశ్వర్ పాండా, ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌పైకి దూసుకెళ్లిన కారు



కారుని బయటకు తీస్తున్న జనం

సింహాచలం: పాత గోశాల వద్ద డివైడర్‌పైకి కారు దూసుకెళ్లిన సంఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. సుమారు రాత్రి 8 గంటల సమయంలో అడవివరం నుంచి వేపగుంట వైపు వెళ్తున్న కారు బీఆర్‌టీఎస్ రోడ్డు ఎంట్రన్స్‌లో డివైడర్‌పైకి దూసుకెళ్లింది. కారులో ఉన్నవారికి ఎలాంటి గాయాలు కాలేదు.

రేపు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కొమ్మాది: జూ పార్క్, దసపల్లా 11 కేవీ ఫీడర్ల మరమ్మతుల నిర్వహణ కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్టు ఏఈ ఎం.రాజేష్ తెలిపారు. కూచిపూడి కళావేదిక, జూపార్క్, గుడ్లవానిపాలెం, సాగర్‌నగర్, ముసలయ్యపాలెం, భువనేశ్వర్‌కాలనీ, దసపల్లా లే అవుట్, తాటిచెట్లపాలెం, సుభాష్‌నగర్ ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్టు తెలిపారు.

భీమిలిలో...

భీమిలి, జేవీ అగ్రహారం, కొత్తవలస, కృష్ణాకాలనీ, ఎగువపేట, కీతినపేట, డెక్కటిపాలెం, మరడపాలెం, మహాలక్ష్మిపురం, మామిడిపాలెం, రాయపాలెం, కె.మూలకుద్దు, రేకవానిపాలెం, నేరెళ్ళవలస, గంగడపాలెం, కాపులుప్పాడ, కాపులదిబ్బడపాలెం, మంగమారిపేట, నగరపాలెం, తిమ్మాపురం, చుక్కవానిపాలె, నిడిగట్టు, రామజోగిఅగ్రహారం, చేపలుప్పాడ, కొత్తూరు, పెద్ద ఉప్పాడ, పుక్కళ్ళపాలెం, గొల్లలపాలెం, కొ్ళవానిపాలెం, పాతపరదేశిపాలెం, రెడ్డిలపాలెం, సోమన్నపాలెం ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు ఏఈ యు.శంకరయ్య తెలిపారు.


గజేంద్ర మోక్షంపై ప్రసంగం

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రిజమ్ కళాశాలలో బుధవారం జరిగిన సాహిత్య కార్యక్రమంలో శేఖరమంత్రి ప్రభాకర్ గజేంద్ర మోక్షంపై ప్రసంగించారు. శరణు కోరిన వారి రక్షణ బాధ్యత భగవానుడే స్వీకరించి కాపాడుతాడన్నది సత్యమని, భాగవతంలోని అష్టమ స్కందంలో పోతన దీని గురించి వివరించాడని తెలిపారు. ప్రతి ఒక్కరూ భాగవతాన్ని పఠించి తరించాలన్నారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు కె.జి.వేణు, డి.వి.సూర్యారావు, ఫణిశయన సూరి, కె.వి.ఎస్.మూర్తి, భాగవతుల సత్యనారాయణమూర్తి, చిన సూర్యనారాయణ పాల్గొన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

గోపాలపట్నం: మనస్తాపం చెంది ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వెంకటాపురం గొల్ల వీధిలో జరిగింది. గోపాలపట్నం పోలీసులు తెలిపిన వివరాలిలా.. జీవీఎంసీ 92వ వార్డు గొల్ల వీధికి చెందిన ఉరుకూటి ఈశ్వరరావు(32) రాడ్ బెండింగ్ పని చేసేవాడు. అతడికి తల్లిదండ్రులు, భార్య, రెండు నెలల బాబు ఉన్నాడు. భార్య ప్రసవం నిమిత్తం అక్కయ్యపాలెంలోని పుట్టింటికి వెళ్లింది. బుధవారం సాయంత్రం ఈశ్వరరావు తల్లిదండ్రులు బయటకు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని సాయంత్రం 6 గంటల సమయంలో ఇంటి శ్లాబ్ హుక్‌కి ఉరి వేసుకుని మృతి చెందాడు. మృతికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని, కేసు దర్యాప్తు చేస్తున్న ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. అయితే ఇటీవల ఈశ్వరరావు భార్యకు అనారోగ్యంతో కొడుకు పుట్టాడని, దీంతో మనస్తాపానికి గురయ్యాడని స్థానికులు చెబుతున్నారు. మృతుడి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు.

ఎరుకుమాంబకు జలాభిషేకం



అమ్మవారికి జలాభిషేకం చేస్తున్న భక్తులు

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ ఆలయంలో అమ్మవారికి భక్తులు స్వహస్తాలతో జలాభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ ఈవో రామాబాయి ఆధ్వర్యంలో అర్చకుడు శ్రీనివాస్ అమ్మవారిని పూజించారు. ఉదయం గణపతి పూజ, అమ్మవారికి భక్తుల గోత్రనామాలతో అభిషేకాలు చేశారు. పంచామృతాభిషేకం అనంతరం విశేష పూజలు జరిపారు. సాయంత్రం అమ్మవారిని పసుపుతో అలంకరించి, హారతులిచ్చారు. అమ్మవారు భక్తులకు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు.

16న ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ ముట్టడి

ఉక్కునగరం: ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 16న ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ ముట్టడి కార్యక్రమం నిర్వహించనున్నారు. బుధవారం స్టీల్‌ప్లాంట్‌లో జరిగిన అఖిలపక్ష పోరాట కమిటీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో స్టీల్‌ప్లాంట్ కార్మికుల వేతన ఒప్పందం అమలు ఏకైక అజెండాగా ఈ మేరకు తీర్మానించారు. సెయిల్‌లో 2021 డిశంబర్ నుంచి అమలు చేసినప్పటికీ విశాఖ ఉక్కులో అమలు చేయకపోవడం పట్ల కార్మికుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. ఈ నేపథ్యంలో యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చేందుకు ముట్టడి కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఏయూ విద్యార్థులు ఎన్ఎస్‌టీఎల్ సందర్శన



ఎన్ఎస్‌టీఎల్ సందర్శనకు వెళ్లిన ఏయూ విద్యార్థులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం భౌతికశాస్త్ర విభాగం విద్యార్థులు బుధవారం నేవల్ సైన్స్ అండ్ టెక్నాలజీ లేబొరేటరీ(ఎన్ఎస్‌టీఎల్)ని సందర్శించారు. జాతీయ సైన్స్ దినోత్సవంలో భాగంగా ఎన్ఎస్‌టీఎల్ ఓపెన్ హౌస్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేసింది. దీనిలో భాగంగా ఏయూకు చెందిన 60 మంది విద్యార్థులను విభాగాధిపతి డి.బి.వెంకటాద్రి ఎన్ఎస్‌టీఎల్‌కు తీసుకువెళ్లి, అక్కడ జరిగే పరిశోధనల వివరాలను తెలియజేశారు.

13న సహస్రచండీ పారాయణం, హోమం



పోస్టర్ విడుదల చేస్తున్న నిర్వాహకులు

ఏయూ క్యాంపస్ : లోక కల్యాణార్థం ఆర్కే బీచ్ వేదికగా ఈ నెల 13న మధ్యాహ్నం 3 గంటల నుంచి సహస్ర చండీ పారాయణ, హోమం నిర్వహించనున్నట్టు ప్రతినిధి అవసరాల ప్రసన్నకుమార్ తెలిపారు. బుధవారం ఉదయం ఏయూ ప్లాటినం జూబ్లీ సమావేశ మందిరంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కార్యక్రమ వివరాలతో కూడిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమృతానంద నాథ సరస్వతి దివ్య ఆశీస్సులతో, శ్రీవేణి మాత పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. 108 హోమ కుండములతో 1008 మంది భక్తులతో ఈ కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించామన్నారు. హోమంలో పాల్గొనే వారు ఎటువంటి రుసుం చెల్లించనవసరం లేదన్నారు. ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి మాత్రమే హోమంలో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. వివరాలకు 91600 05430, 94403 30246 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ చల్ల కృష్ణవీర్ అభిషేక్, మల్లేశ్వరరావు, సతీష్ పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి

సీతంపేట: చిరంజీవి కళాపరిషత్ ఆధ్వర్యంలో బుధవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకులను అలరించింది. గాయనీ గాయకులు బిశ్వాస్, గెంబలి జగదీష్, కోసూరు రాజు, నాయుడు, కుసుమ, గౌరి, స్వర్ణ, లక్ష్మీప్రియ సినీ గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు జి.జగదీష్, ప్రతినిధులు తిరుమలరావు, ఎం.వి.రాజశేఖర్ పాల్గొన్నారు.